క్లుప్తంగా

చిరుధాన్యాలపై అవగాహన

విజయపురం (నగరి): ప్రతి ఆర్బీకే పరిధిలోని రైతులకు మూడురోజుల పాటు చిరుధాన్యాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు ఏఓ రజినికుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. చిరుధాన్యాల సాగు రైతులకు లాభదాయకమని, ప్రతి రైతు కొర్ర, రాగి, జొన్నపంటలు సాగు చేసి అధికలాభం పొందాలని ఆమె కోరారు. రైతులు సాగు చేసిన ఉత్తర్వులను ప్రభుత్వమే మద్దతు ధరతో కొనగోలు చేస్తుందన్నారు. ప్రతి రైతు సదస్సులో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నింద్ర ఎంఈఓగా శ్రీధర్‌రాజు



నింద్ర: మండల ఎంఈఓగా శ్రీధర్ రాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంఈఓగా ఉన్న నారాయణ బదిలీపై నిమ్మనపల్లి మండలానికి వెళ్లగా, శ్రీధర్ రాజు ఇక్కడికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్కూళ్ల బలోపేతానికి కృషి చేస్తానన్నారు. స్థానిక హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఆయనకు స్వాగతం పలికారు.

ఎంఈఓ–2గా హరిప్రసాద్ వర్మ



విజయపురం (నగరి): విజయపురం ఎంఈఓ–2గా హరిప్రసాద్ వర్మ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన నగరి రూరల్ మండల ఎం.కొత్తూరు ఉన్నత పాఠశాలలో గ్రేడ్–2 హెచ్‌ఎంగా పని చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారుల మేరకు విజయపురం ఎంఈఓ–2గా బాధ్యతలు చేపడుతున్నట్లు ఎంపీడీఓ ప్రసాద్‌కు ఉత్తర్వుల కాపీ అందించారు.

పాలసముద్రం ఎంఈఓ–2గా గిరిజ



పాలసముద్రం: మండలంలో 2వ ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన గిరిజను సోమవారం ఎమ్మార్సీలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుప్పం మండలంలో కేబీపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తున్న తాను పదోన్నతిపై పాలసముద్రం మండల 2వ ఎంఈఓగా వచ్చినట్లు చెప్పారు. విద్యాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఎంఈఓ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయుల బృందం, సీఆర్పీలు పాల్గొన్నారు.

తాగునీటికే మొదటి ప్రాధాన్యత

శ్రీరంగరాజపురం: గ్రామాల్లో తాగునీటికే మొదటి ప్రాధాన్యత కల్పిస్తున్నామని ఉడమాలకుర్తి సర్పంచ్ చిట్టి అన్నారు. సోమవారం పంచాయతీలోని తుంగమిట్ట గ్రామంలో తాగునీటి కోసం గ్రామస్తులు ఇబ్బంది పడుతుంటే వెంటనే స్పందించి సర్పంచ్ చిట్టి నూతనంగా బోరు వేశారు. అలాగే మరమ్మతులకు గురైన చేతిబోరును రిపేరు చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని గ్రామస్తులకు సూచించారు. పంచాయతీలో నీటిఎద్దడి రాకుండా ప్రభుత్వం అదనంగా నూతన బోరును మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, రమేష్, బుడగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లల్లోనే నాణ్యమైన విద్య



జగనన్న విద్యాకానుక కిట్లు విద్యార్థులకు తల్లిదండ్రులకు అందిస్తున్న ఎల్లమ్మ

పాలసముద్రం: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు ఉన్నత విద్య లభిస్తోందని హెచ్‌ఎం చక్రధరరావ్ తెలిపారు. సోమవారం వెంగళరాజుకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కమిటీ చైర్మన్ ఎల్లమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. అనంతరం హెచ్‌ఎం చక్రధరరావ్ మాట్లాడుతూ జగనన్న విద్యాకానుక కింద పుస్తకాలు, బ్యాగ్స్, నోట్‌బుక్స్, యూనిఫాం, బూట్లు అందజేస్తామన్నారు. అమ్మఒడి, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం, విద్యార్థుల చదువులకు నాడు–నేడు కింద మౌలిక వసతులు వంటి వాటిని ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో సంపంగి, పాఠశాల ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

ఆయుర్వేద కళాశాలలో యోగాపై అవగాహన

తిరుపతి తుడా: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని టీటీడీ ఆయుర్వేద కళాశాల ఆధ్వర్యంలో మూడు రోజుల అవగాహన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నిపుణులు వివిధ యోగాసనాలను ప్రదర్శించి విద్యార్థులతో చేయించారు. యోగా చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం, ఏకాగ్రత సాధ్యమని, ఒత్తిడిని ఎదుర్కొనే శక్తి లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఆయుర్వేద కళాశాల వైస్ ప్రిన్సిపల్ సుందరం, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆచార్యులు లక్ష్మీ నారాయణ, ప్రిన్సిపల్ నారాయణమ్మ, ఆయుర్వేద కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చంద్ర కిషోర్, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు ముస్తాక్ అహ్మద్, విజయశ్రీ పాల్గొన్నారు.

సంస్కరణలతోనే విద్యాభివృద్ధి

- ప్రగతిబాటలో సర్కారు స్కూళ్లు
- విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం
- నాడు–నేడు కింద స్కూళ్లలో అన్ని వసతులు
- పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారం, ప్రోత్సాహకాలు
- 'జగనన్న ఆణిముత్యాలు'లో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం



ఏకాంబరకుప్పం జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులతో మున్సిపల్ చైర్మన్ నీలమేఘం





పుత్తూరు: ప్రతిభ చూపిన విద్యార్థులతో వైస్ చైర్మన్ శంకర్, కార్వేటినగరంలో..

నగరి: ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలు మార్చి విద్యార్థులను ప్రగతి బాటలో నడిపిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఏకాంబరకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించి మొదట, రెండు, మూడుస్థానాల్లో నిలిచిన విద్యార్థులను 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమంలో భాగంగా దుశ్శాలువతో సత్కరించి షీల్డ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు పుట్టినప్పటి నుంచి ఉన్నత చదువులు చదివేంత వరకు అన్నివిధాలుగా సీఎం జగనన్న తోడ్పాటు అందిస్తున్నారని చెప్పారు. పిల్లలను స్కూల్‌కు పంపే తల్లులకు అమ్మఒడి కింద రూ.15 వేలు అందజేయడంతో పాటు పాఠశాలలో పుస్తకాలు, బ్యాగులు, యూనిఫారంతో పాటు జగనన్న గోరుముద్ద రూపంలో ఎన్నో రకాల విలువైన కానుకలను స్కూళ్ల తెరిచిన మొదటి రోజునే అందించడం అద్భుతమైన విషయమన్నారు. సంస్కరణలతో విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఎప్పుడైనా విద్యాకానుక, వసతి దీవెన, అమ్మఒడి పథకాలను అందించిందా ? అని విద్యార్థులను ప్రశ్నించారు. లేదు అని వారు ముక్తకంఠంతో నినదించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బాలు, హెచ్‌ఎం నమశ్శివాయం, ఎస్‌ఎంసీ చైర్మన్ వేందాం తదితరులు పాల్గొన్నారు. ముడిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ భార్గవి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను దుశ్శాలువలతో సత్కరించి షీల్డులు, పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె విద్యావ్యవస్థకు సంబంధించి సీఎం జగనన్న చేస్తున్న మంచి పనులను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీదేవి, సర్పంచ్ ప్రకాష్, ఎంపీటీసీ సులోచనమ్మ, హెచ్‌ఎం మురళీకృష్ణ, ఎస్‌ఎంసీ చైర్మన్ అయ్యప్ప, నాయకులు భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తడుకుపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో వైస్ ఎంపీపీ కన్నియప్ప ప్రారంభించగా సర్పంచ్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. ఎం.కొత్తూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, వైస్‌ఎంపీపీ డిల్లీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా సర్పంచ్ నరసింహులు, నాయకులు గోవిందు, దాము నాయుడు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పుత్తూరులో..

పుత్తూరు రూరల్: ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల ప్రోత్సాహకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ డి.శంకర్ సూచించారు. సోమవారం స్థానిక గేట్ పుత్తూరులోని జెడ్పీహెచ్‌ఎస్ తమిళ పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల స్థాయిలో పదో తరగతిలో తొలి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులు కె.నదియ, ఆర్.ప్రీతి, ఆర్.జయశ్రీకి వరుసగా రూ.3 వేలు, 2 వేలు, రూ.వెయ్యి వంతున నగదుతో పాటు మెడల్, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణవేణి, ఎస్‌ఎంసీ చైర్మన్ రాజ్యలక్ష్మి, వైస్ చైర్మన్ సెల్వం పాల్గొన్నారు. పుత్తూరు రూరల్ మండల పరిధిలోని వేపగుంట, పరమేశ్వరమంగళం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఎంపీపీ మునివేలు జగనన్న ఆణిముత్యాలు కింద బహుమతులు అందజేశారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

కార్వేటినగరం: విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆర్కేఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఇందిరా అన్నారు. సోమవారం ఉన్నత పాఠశాలలో ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ 10వ తరగతిలో 563 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన జీ.యామినికి రూ.3 వేలు నగదు, బంగారు పతకం, 541 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచిన సీ.డిల్లీ ఐశ్వర్య, ఎస్.నిషాద్, ఆర్‌బీ నరసింహరాజు ముగ్గురు విద్యార్థులకు రూ.2 వేలు చొప్పున ప్రోత్సాహక బహుమతులు, 523 మార్కులు సాధించి తృతీయస్థానంలో నిలిచిన పీ.దిలీప్‌కుమార్‌కు రూ.వెయ్యి, రాగి పతకాన్ని అందించి సత్కరించినట్లు తెలిపారు. విద్యార్థిని యామిని తెలుగులో 100/100 మార్కులు సాధించడంతో తెలుగు పండిట్ మాధవరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణగా దిశా యాప్



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ వేణుగోపాల్

నగరి: సమాజంలో స్త్రీలపై జరుగుతున్న అఘాయిత్యాలను నివారించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఈ దిశా యాప్ ఎంతగానో ఉపయోగపడుతోందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఆర్.వేణుగోపాల్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ సెల్, నగరి పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం దిశా యాప్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. మహిళా పోలీసు వి.లక్ష్మి మాట్లాడుతూ దిశా యాప్ స్త్రీల రక్షణ కోసమని, ప్రత్యేకించి దిశా పోలీసు విభాగం 24 గంటలు పనిచేస్తుందన్నారు. ఆపద సమయంలో దిశ యాప్ ఎలా వినియోగించాలో సూచించారు. కార్యక్రమంలో యాంటీ ర్యాగింగ్ సెల్ కోర్డినేటర్ సి.చిన్నపాపమ్మ, మెంబర్ ఆర్.శ్రీనివాస్, మహిళా పోలీసు అలేఖ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నియంత్రణపై అవగాహన



బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ పద్మసునంద

కార్వేటినగరం: గ్రామీణ ప్రాంతాల్లో జరిగే బాల్యవివాహాలపై అంగన్‌వాడీ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మసునంద అన్నారు. సోమవారం సీడీపీఓ కార్యాలయంలో బేటీ బచావో..బేటీపడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బంది తమ పరిధిలోని మేజర్, మైనర్ బాలికల వివరాలను సేకరించాలన్నారు. ఆధార్ ద్వారా వయసును నిర్ధారించి, వివాహాలకు అనుమతి ఇవ్వాలని సూచించారు. కొందరు ఆస్తుల కోసం బాల్యవివాహాలు చేసి ఆడపిల్లల జీవితాలను నాశనం చేస్తున్నారని, అలాంటి విషయాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అదేవిధంగా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, వరకట్న వేధింపులపై కూడా దృష్టి సారించాలని సూచించారు. బాలింతలకు, గర్భిణులకు గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి రక్తహీనతపై అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఇందిర, శ్యామిని, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులతో సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రేమ్ రాజ్‌కుమార్

పాలసముద్రం: మండల పరిధిలో గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు బాధ్యతగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని ఎంపీడీఓ ప్రేమ్ రాజ్‌కుమార్, తహసీల్దార్ బాబు తెలిపారు. సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అన్ని సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో గత వారం రోజులుగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి దృష్టికి ప్రజలు తీసుకొచ్చిన సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వాటి పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. ముఖ్యంగా మంజూరైన ఇళ్ల నిర్మాణం, సీసీ రోడ్లు, కొత్తఇండ్లు మంజూరు జాబితాను సర్వే చేసి ఇవ్వాలని తెలిపారు. తహసీల్దార్ బాబు మాట్లాడుతూ ప్రతి గ్రామానికి శ్మశానం, వెళ్లడానికి రోడ్డు తప్పకుండా చూపించాలన్నారు. వలంటీర్లు గ్రామాలకు వెళ్లి పదో తరగతి నుంచి డిగ్రీ, బీటెక్ చదివిన వారి వద్దకు వెళ్లి కులం, ఆదాయ, నివాస సర్టిఫికెట్లకు దరఖాస్తు తీసుకుని అందరికీ ఇంటికే సర్టిఫికెట్లు అందించాలన్నారు. వారు సర్టిఫికెట్ల కోసం గ్రామ సచివాలయాల చుట్టూ తిరగరాదని తెలిపారు. అందువల్ల వలంటీర్లు సర్టిఫికెట్ల పంపిణీలో బాధ్యతగా చేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వారికి కేటాయించిన 50 కుటుంబాలకు సక్రమంగా అందించి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్ పాల్గొన్నారు.

శ్మశానంలో ఆక్రమణలపై ఫిర్యాదు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న బాలినాయుడు కండ్రిగ గ్రామస్తులు

పుత్తూరు రూరల్: శ్మశాన స్థలంలో ఆక్రమణలు తొలగించాలని కోరుతూ వడమాలపేట మండలంలోని బాలినాయుడు కండ్రిగ గ్రామస్తులు సోమవారం తిరుపతి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలినాయుడు కండ్రిగ గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 129/1లో 97 సెంట్ల భూమిని ఎన్నో ఏళ్లుగా శ్మశానానికి వినియోగిస్తున్నట్లు తెలిపారు. అయితే అదే గ్రామానికి చెందిన జయరామిరెడ్డి అనే వ్యక్తి ఆరు నెలల కిందట శ్మశాన స్థలంలో మామిడి మొక్కలు నాటి, చుట్టూ కంచె ఏర్పాటు చేసుకున్నాడని ఆరోపించారు. ఈ విషయాన్ని స్థానిక తహసీల్దార్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. గ్రామంలో 120 కుటుంబాలకు చెందిన వారు నివాసం ఉంటున్నామని, తక్షణం శ్మశాన స్థలంలో ఆక్రమణలను తొలగించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

నేడు శిక్షణ

విజయపురం (నగరి): మండల కేంద్రం ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లకు కుష్టువ్యాధిపై శిక్షణ ఇస్తున్నట్లు డాక్టర్ సోమశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వలంటీర్లు, ఆశావర్కర్లు సర్వేలో భాగంగా ఈ నెల 26వ తేదీ నుంచి రోజూ 20 నుంచి 35 ఇళ్లను సందర్శించాలని సూచించారు. కుష్టువ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి పీహెచ్‌సీల్లో వైద్య పరీక్షలు చేయించేలా చూడాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే పట్టణ ఆరోగ్య కేంద్రాలకు పంపి, వైద్యం అందించాలని సూచించారు.

ఘనంగా మాతమ్మ తిరనాళ్లు



ఊరేగింపుగా వస్తున్న మాతమ్మ

నగరి: మున్సిపల్ పరిధిలోని కాకవేడు ఆదిఆంధ్రవాడలో సోమవారం మాతమ్మ తిరనాళ్లు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాతమ్మ ఆలయం వద్ద ప్రత్యేక ముగ్గులు వేసి, దీపాలు వెలిగించి పూజలు చేశారు. మాతమ్మ అమ్మవారిని సుందరంగా అలంకరించి ఊరేగించారు. ఈ సందర్భంగా అమ్మవారిని భక్తులు దర్శించుకుని కర్పూర హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో పరశురాం, సుందరమూర్తి, గోవిందస్వామి, అయ్యప్ప, శీను, దేశయ్య, రాజేంద్ర, కుమారస్వామి, నడుపయ్య తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి చేయూత



సాయం అందజేస్తున్న గుణశేఖర్

వెదురుకుప్పం: మండలంలోని బొమ్మయ్యపల్లెకు చెందిన రమేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అయితే రమేష్‌కు నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. అందులో ఓ కూతురు రేష్మకు దేవళంపేట సోక్రటీస్ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం చేయూత అందించింది. ఈ విద్యార్థిని దేవళంపేటలోని సోక్రటీస్ ప్రైవేట్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. తండ్రి కోల్పోయిన విద్యార్థినిని సోక్రటీస్ స్కూల్ కరెస్పాండెంట్ గుణశేఖర్ సోమవారం బొమ్మయ్యపల్లె గ్రామంలో పర్యటించి బాధిత కుటుంబానికి రూ.2 వేలు ఆర్థికసాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రమేష్ కుమార్తెల్లో ఒకరైన రేష్మను తాను దత్తత తీసుకుంటున్నట్లు వెల్లడించాడు. ఆమెకు పదో తగరతి వరకు ఉచితంగా విద్యను అందించడంతో పాటు అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు.

హైకోర్టు ఆదేశాలు అమలు చేయండి



తహసీల్దార్‌కి వినతిపత్రం ఇస్తున్న రైతులు

పుత్తూరు రూరల్: రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు తమకు ఈ–పాస్‌బుక్స్‌ను వెంటనే మంజూరు చేయాలని సోమవారం వీఎస్‌ఎస్ పురం రైతులు తహసీల్దార్ పరమేశ్వరస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు నాయకుడు కె.గంగాధరం మాట్లాడుతూ పుత్తూరు మండలం తడుకు పంచాయతీ వీఎస్‌ఎస్ పురానికి చెందిన వ్యవసాయ భూములకు సంబంధించి 2006లో 319 రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. రైతులు ఈపాస్ బుక్స్ కోసం 2014లో కోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు. కోర్టు 108 మంది రైతులకు ఈపాస్ బుక్స్ మంజూరు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సైతం తహసీల్దార్‌తో మాట్లాడి రైతుల సమస్యను వెంటనే పరిష్కరించాల్సిందిగా ఆదేశించినట్లు తెలిపారు. కోర్టు ఆదేశాలను అమలు చేయనున్నట్లు తహసీల్దార్ స్పష్టం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జయప్రకాష్, రైతు నాయకులు దుర్వాసులు, మస్తాన్, గురుమూర్తి, చెంగ్రాయులు, జయరామ్ మండడి, ధర్మయ్య, సదాశివయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



ఉపాధ్యాయుడు రామకృష్ణ దంపతులను సత్కరిస్తున్న గ్రామస్తులు

వెదురుకుప్పం: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ అన్నారు. మండలంలోని బొమ్మన్‌దొడ్ల ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు రామకృష్ణను సోమవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. పూలమాల వేసి దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్య రంగానికి పెద్ద పీటవేస్తోందన్నారు. సమాజంలో మార్గదర్శకులు ఉపాధ్యాయులేనని, అంకితభావంతో పనిచేసి పేద విద్యార్థులు ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శాంతమ్మ, యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు దేశయ్య, ఉపాధ్యాయురాలు హేమలత, సామాజిక కార్యకర్త రోశయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు బాలయ్య, శంకరయ్య, వెంకటేష్, రాజవేలు, యువత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొండమల్లీశ్వరునికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో స్వామివారు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎస్ కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశ్వరునికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. ఆలయ ఆవరణలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పారిశుద్ధ్యానికి ప్రత్యేక చర్యలు



స్ప్రేయింగ్ మెషిన్లను ప్రారంభిస్తున్న చైర్మన్

నగరి: వర్షాకాలం రానుండడంతో పారిశుద్ధ్య నిర్వహణకు మున్సిపల్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. వర్షాల కారణంగా మలేరియా, డెంగీ, ఫైలేరియా, చికెన్ గున్యా, మెదడు వాపు వ్యాధులు ప్రబలకుండా ప్రజారోగ్యశాఖ పారిశుద్ధ్య విభాగంలో కొత్తగా 18 స్ప్రేయింగ్ మిషన్లు కొనుగోలు చేశారు. మిషన్లను సోమవారం మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ కె.వెంకట్రామి రెడ్డి నూతన స్ప్రేయింగ్ మిషన్లను పారిశుద్ధ్య సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని దోమల నివారణకు 18 స్ప్రేయింగ్ మిషన్లను కొనుగోలు చేసినట్లు తెలిపారు. డీఈఈ పి.నరేష్ బాబు, ఏఈ కె.రమేష్, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కేజీ పురుషోత్తం పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగనన్న

- ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నాం
- జగనన్న పాలనలో ప్రతి మహిళా ఆనందంగా ఉంది
- సచివాలయం, ఆర్బీకే కేంద్రాల ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి





లబ్ధిదారులకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం): అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తూ పేదల పక్షపాతిగా సీఎం జగనన్న నిలుస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. సోమవారం జీడీ నెల్లూరు మండల కేంద్రంలోని కట్టకిందపల్లి, మోతరంగనపల్లి, రామానాయుడుపల్లి, ముస్లింకాలనీ, బీసీకాలనీ, గంగాధరనెల్లూరు ఎస్సీ కాలనీల్లో ఎంపీపీ అనిత ఆధ్వర్యంలో సచివాలయం, రైతుభరోసా కేంద్రం, మినరల్ వాటర్ కేంద్రాలను ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డితో కలసి ప్రారంభించారు. అనంతరం ఆయన జోరుగా వర్షం కురుస్తున్నా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా సంక్షేమ పథకాలను అందిస్తూ పేదవారు ఆర్థికాభివృద్ధి కృషి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని గుర్తు చేశారు. ప్రభుత్వ అధికారులు గ్రామస్థాయిలో సేవలు అందించేలా సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు వంటి బృహత్తర కార్యక్రమాలు చేసిన ఘనత కూడా సీఎం వైఎస్ జగనన్నదేనని అన్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలను అందించడమే కాకుండా ప్రభుత్వ పాలనను సైతం మారుమూల గ్రామాలకు తీసుకొచ్చి గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యాన్ని నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. అనంతరం ఇంటి పట్టాలు, డ్రైనేజీ, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని పలువురు మంత్రి దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఆయన అర్హులైన ప్రతి ఒక్కరికీ నివాస స్థలాలతో పాటు ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్లు నిర్మాణం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం పలువురు బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు..

రాష్ట్రంలో అర్హత ప్రతి మనిషికి ప్రభుత్వ పథకాలు అందించి ఆదుకుంటున్న ఘనత సీఎం జగనన్నదే అని ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి అన్నారు. సోమవారం జరిగిన పలు అభివృద్ధి ప్రారంభోత్సవాల్లో ఆయన డిప్యూటీ సీఎం నారాయణస్వామితో పాటు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగనన్న ప్రవేశ పెట్టిన నవరత్నాలు పథకాల ద్వారా ప్రతి పేదవాడికి సొంతింటి కలను నెరవేరుస్తూ పక్కాగృహాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు హరిబాబు, బేబీ, రాష్ట్ర బ్యూటీషియన్ డైరెక్టర్ గుణశేఖర్, సర్పంచ్‌లు సుబ్రమణ్యం, ఏకాంబరం, నాయకులు గోవిందరెడ్డి, వెంకటేశులురెడ్డి, ఎంపీడీఓ శ్రీదేవి, తహసీల్దార్ ఇన్బనాథన్, డీఈ దయాసాగర్‌రెడ్డి పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

డీలర్లు బాధ్యతగా పని చేయండి

కార్వేటినగరం: మండలంలోని రేషన్ డీలర్లు బాధ్యతగా పని చేయాలని, లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకులను సకాలంలో అందించడంలో జాప్యం లేకుండా చూడాలని తహసీల్దార్ రవికుమార్ రాజు ఆదేశించారు. మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయనను ప్రభుత్వ చౌక దుకాణ డీలర్ల సంఘం నాయకులు, డీలర్లు సోమవారం శాలువ కప్పి పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ చౌక దుకాణాల్లో ప్రభుత్వం సరఫరా చేసే ప్రతి వస్తువు ప్రజలకు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీపతిరెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.

స్పందన వినతులపై దృష్టి పెట్టండి

శ్రీరంగరాజపురం: స్పందనలో వచ్చిన వినతులపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్ లోకనాథపిళ్లై తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 9 వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ స్పందనలో ప్రజల నుంచి వచ్చే వినతులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ సమస్యలు, ధ్రువపత్రాల మంజూరు జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, అర్జీదారులు పలువురు పాల్గొన్నారు.